సాక్షి పెద్దపల్లి

శుక్రవారం, 10, నవంబర్, 2023

ఆ నలుగురిని కలవడం ఆనవాయితీ



మంథని: మంథని నుంచి నాలుగుసార్లు గెలిచిన పీవీ నర్సింహారావు ఎన్నికల సమయంలో ఇక్కడికి ఎప్పుడు వచ్చినా తన చిన్ననాటి మిత్రులను కలుసుకుని కాసేపు ముచ్చటించేవారు. 1983 అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా కేంద్ర విదేశాంగ మంత్రి హోదాలో పీవీ.నర్సింహారావు తన ఆత్మీయ మిత్రుడు వెంకటరాజన్న అవధాని(మేధావి)తో మంథనిలోని తన ఇంట్లో కాసేపు కూర్చునేవారు. ఇలా ప్రతిసారి ఎన్నికల్లో వెంకటరాజన్నతో పాటు పనకంటి కిషన్‌రావు, గులుకోట శ్రీరాములు, కర్నె పుల్లయ్యను పీవీ కలిసి వెళ్లేవారు.

నామినేషన్ల వివరాలు.. 6వ రోజు

నియోజకవర్గం	నామినేషన్లు	సెట్లు
పెద్దపల్లి	10	12
రామగుండం	12	12
మంథని	09	09

న్యూస్‌రీల్

న్యాయ సేవలపై అవగాహన ఉండాలి



మాట్లాడుతున్న జిల్లా జడ్జి హేమంత్‌కుమార్

పెద్దపల్లిరూరల్: పేదలు న్యాయస్థానంలో అవసరమైన సేవలను ఉచితంగా పొందవచ్చని, న్యాయసేవలపై కనీస అవగాహన పెంచుకోవాలని జిల్లా జడ్జి హేమంత్‌కుమార్ అన్నారు. గురువారం న్యాయసేవా దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో సీనియర్ సివిల్ జడ్జి అర్జున్, జూనియర్ జడ్జి రాణితో కలిసి పాల్గొని మాట్లాడారు. అర్హులైన కార్మికులంతా ఈశ్రమ్ కార్డు పొందాలని సూచించారు. తమ పేర్లను నమోదు చేసుకోవడం ద్వారా ఏదైనా ప్రమాదాలు జరిగినప్పుడు ప్రభుత్వపరంగా పరిహారం లభిస్తుందన్నారు. న్యాయపరమైన సాయం అవసరమైనప్పుడు జిల్లా న్యాయ సేవాధికార సంస్థకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేస్తే ప్రతివాదిని పిలిపించి పరిష్కరిస్తారని, లేదంటే ఉచితంగానే న్యాయవాదిని నియమిస్తారని వివరించారు. కార్యక్రమంలో శ్రీనివాస్, డీవీఎస్ మూర్తి, సంతోష్‌కుమార్, శంకర్, న్యాయవాదులు పాల్గొన్నారు.

నాణ్యమైన ధాన్యానికి మద్దతు ధర

పెద్దపల్లిరూరల్: రైతులు పండించిన వరి దిగుబడులను కొనుగోలు కేంద్రాల్లో మద్దతు ధరకే విక్రయించుకోవాలని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ అన్నారు. కలెక్టరేట్‌లో అడిషనల్ కలెక్టర్ శ్యాం ప్రసాద్‌లాల్‌తో కలిసి పోస్టర్ ఆవిష్కరించారు. కొనుగోలు కేంద్రాల్లో గ్రేడ్ ఏ రకం ధాన్యం క్వింటాల్‌కు రూ.2,203, సాధారణ రకానికి రూ.2,183 చెల్లించి కొనుగోలు చేస్తారని పేర్కొన్నారు. రైతులు నిబంధనలకు లోబడి నాణ్యతాప్రమాణాలు పాటించాలన్నారు. ఆధార్, బ్యాంకు ఖాతాతో లింక్ చేసిన సెల్‌ఫోన్‌ను రైతులు వెంట తెచ్చుకోవాలన్నారు. ఏమైనా సమస్యలుంటే టోల్‌ఫ్రీ నంబరు 1967 లేదా 18004250033 ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. కార్యక్రమంలో డీఆర్‌డీవో శ్రీధర్, డీఎస్‌వో ప్రేమ్‌కుమార్, డీఎం శ్రీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కటికెనపల్లి పాఠశాల సందర్శన



పాఠశాల పరిసరాలను పరిశీలిస్తున్న డీఈవో

ధర్మారం(ధర్మపురి): మండలంలోని కటికెనపల్లి ప్రాథమిక పాఠశాలను గురువారం జిల్లా విద్యాధికారి మాధవి సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలోని మైదానం, పరిసరాలను పరిశీలించారు. పాఠశాల ఆవరణలో ప్రారంభించనున్న కిచెన్ గార్డెన్ కోసం స్థల పరిశీలన చేసి ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. కిచెన్ గార్డెన్‌లో ఏయే కూరగాయలు పెంచాలో, ఎలాంటి రక్షణ చర్యలు తీసుకోవాలో ఉపాధ్యాయులకు వివరించారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి మాట్లాడారు. పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెరిగేలా విద్యాబోధన ఉండాలన్నారు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం సిలబస్ పూర్తిచేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో జయశీల, హెచ్‌ఎం ప్రభాకర్‌రెడ్డి, ఉపాధ్యాయులు నూతి మల్లయ్య, రేవతి, ఎంపీవో రవి తదితరులు పాల్గొన్నారు.


విద్యుత్ సమస్యలకు వెంటనే పరిష్కారం



మాట్లాడుతున్న వేణుగోపాల్‌చారి

ఓదెల(పెద్దపల్లి): విద్యుత్ వినియోగదారుల సమస్యలు వెంటనే పరిష్కరిస్తామని టీఎస్ఎన్‌పీడీసీఎల్ వరంగల్ చైర్మన్ వేణుగోపాల్‌చారి పేర్కొన్నారు. గురువారం ఓదెల సబ్‌స్టేషన్లో ఏర్పాటు చేసిన వినియోగదారుల సమస్యల పరిష్కార వేదికలో మాట్లాడారు. వినియోగదారులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తినా వెంటనే పరిష్కార వేదికల దృష్టికి తీసుకురావాలన్నారు. రైతుల పంట పొలాలకు విద్యుత్ సరఫరా, స్తంభాల మార్పిడి విషయంలో రాతపూర్వకంగా ఇవ్వాలని వెంటనే పరిష్కరిస్తామని వివరించారు. ఇళ్లపై నుంచి ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ తీగల తొలగింపు అంశాన్ని సైతం స్థానిక విద్యుత్ సిబ్బంది దృష్టికి తీసుకెళ్లాలని వెంటనే పరిష్కారం చూపుతామని వివరించారు. వినియోగదారులు మాత్రం నెలనెలా బిల్లులు చెల్లించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో సభ్యులు ఎస్.నరేందర్, ఆర్.చరణ్‌దాస్, విద్యుత్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

వస్తా మీ వెనకా..



- పతికి మద్దతుగా సతి
- డమ్మీ నామినేషన్ వేసిన ఎమ్మెల్యే అభ్యర్థుల సతీమణులు
- కోరుట్లలో బీఆర్ఎస్ అభ్యర్థికి తండ్రి..
- ఉమ్మడి జిల్లాలో ఇప్పటివరకు 314 సెట్లు దాఖలు

సాక్షిప్రతినిధి,కరీంనగర్: రాజకీయాల్లో నమ్మకం అనేది చాలా విలువైనది. ఏమాత్రం అవకాశం దొరికినా.. వెన్నుపోట్లు ఎదురవుతాయి. అందుకే, ప్రతీ నాయకుడు తాను వేసే అడుగుల్లో ముందు తన కుటుంబసభ్యులే నడవాలని కోరుకుంటారు. నామినేషన్ వేసే దశ నుంచే ఈ మేరకు ముందుజాగ్రత్త చర్యలు తీసుకుంటారు. అభ్యర్థులు ఎన్నికల సంఘానికి సమర్పించే నామినేషన్ అఫిడవిట్‌లో సమస్యలు తలెత్తే అవకాశాలు లేకపోలేదు. అలాంటి సమయంలో నామినేషన్ తిరస్కరణకు గురయ్యే అవకాశాలుంటాయి. ఈ క్రమంలో ముందుచూపుతోనే ఒకప్పుడు నాయకుడు తమకు నమ్మకస్తులైన అనుచరులతో డమ్మీ నామినేషన్ వేయించేవారు. రానూరాను రాజకీయాల్లో వెన్నుపోట్ల సంప్రదాయం పెరిగిపోవడంతో నేతలు తమ కుటుంబసభ్యులతోనే డమ్మీ నామినేషన్ వేయిస్తున్నారు. ఈ ప్రక్రియ ముగిసిన తర్వాత.. అంతా బాగుంది అనుకుంటే తమవారి కోసం వీరు నామినేషన్ ఉపసంహరించుకుంటారు.



- ఈటల: హుజూరాబాద్ బీజేపీ అభ్యర్థి, ఎమ్మెల్యే ఈటల రాజేందర్ సతీమణి జమున ప్రతీ ఎన్నికల సందర్భంగా డమ్మీ నామినేషన్ వేస్తున్నారు. గతంలో ఇలా ఏడుసార్లు వేశారు. ఇప్పుడు కూడా డమ్మీ నామినేషన్ వేశారు.

జంగ్ తెలంగాణ

నామినేషన్లకు నేడు ఆఖరు

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని 12 నియోజకవర్గాల్లో 214 మంది అభ్యర్థులు మొత్తం 314 సెట్ల నామినేషన్లు వేశారు. ఏకాదశి కావడంతో గురువారం భారీగా నామినేషన్లు దాఖలయ్యాయి. నేటి(శుక్రవారం)తో గడువు ముగియనుండటంతో మరిన్ని నామినేషన్లు రావొచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు.

నియోజకవర్గం	అభ్యర్థులు	వచ్చిన నామినేషన్లు
కరీంనగర్	17	25
చొప్పదండి	10	15
మానకొండూర్	15	23
హుజూరాబాద్	23	34
సిరిసిల్ల	14	23
వేములవాడ	15	20
పెద్దపల్లి	22	31
రామగుండం	19	24
మంథని	13	21
జగిత్యాల	37	60
కోరుట్ల	16	21
ధర్మపురి	13	17
మొత్తం	214	314



- కవ్వంపల్లి: కాంగ్రెస్ అభ్యర్థి కవ్వంపల్లి సత్యనారాయణ భార్య అనురాధ నామినేషన్ వేశారు. మానకొండూరు నుంచి ఈసారి ఎలాగైనా గెలవాలని ఆయన సర్వశక్తులు ఒడ్డుతున్నారు.



- పుట్ట: బీఆర్ఎస్ మంథని అభ్యర్థి, మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు సతీమణి, మున్సిపల్ చైర్‌పర్సన్ శైలజ ఆయనకు డమ్మీగా నామినేషన్ వేశారు. ఇలా వేయడం ఇది మూడోసారి.



- ఆది: కాంగ్రెస్ వేములవాడ అభ్యర్థి ఆది శ్రీనివాస్ సతీమణి వనజ నామినేషన్ వేశారు. గతంలో చందుర్తి జెడ్పీటీసీ సభ్యురాలిగా పనిచేసిన ఆమె ఇప్పటివరకు నాలుగుసార్లు ఇలా వేశారు.



- చల్లా: మంథని బీఎస్పీ అభ్యర్థి చల్లా నారాయణ రెడ్డి ప్రస్తుతం కాటారం పీఏసీఎస్ చైర్మన్‌గా ఉన్నారు. ఆయనకు డమ్మీ అభ్యర్థిగా భార్య సుజాత నామినేషన్ వేశారు. ఈమె గతంలో జెడ్పీటీసీ సభ్యురాలిగా పని చేశారు.

- కల్వకుంట్ల: కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు వారసుడిగా ఆయన కుమారుడు సంజయ్ ఈసారి ఎన్నికల బరిలో ఉన్నారు. కుమారుడికి రాజకీయాలు కొత్త కావడంతో తండ్రే అన్నీ తానై చూసుకుంటున్నారు. ఎందుకైనా మంచిదన్న ఆలోచనతో తానే డమ్మీగా నామినేషన్ కూడా వేశారు.



జోరుగా నామినేషన్లు



నామినేషన్ దాఖలు చేస్తున్న కోరుకంటి చందర్



ఎంఎస్ రాజ్‌ఠాగూర్



దాసరి మనోహర్‌రెడ్డి

- గురువారం మంచిరోజు కావడంతో ప్రధాన పార్టీల అభ్యర్థుల దాఖలు
- చివరి రోజు పెరగనున్న నామినేషన్ల సంఖ్య
- నేటితో ముగియనున్న గడువు

సాక్షి, పెద్దపల్లి: ఎన్నికల బరిలో నిలిచే అభ్యర్థులెవరో తేలిపోవడంతో నామినేషన్లు వేసిన ప్రధాన పార్టీల అభ్యర్థులు ప్రజాక్షేత్రంలో తేల్చుకునేందుకు సిద్ధమవుతున్నారు. పోల్‌పోరులో తాడోపేడో తేల్చుకునేందుకు రె'ఢీ' అయ్యారు. గురువారం ఏకదాశి మంచిరోజు కావడంతో ప్రధాన పార్టీల అభ్యర్థులతో పాటు పలువురు నామినేషన్లు వేయడంతో ఒక్కరోజే 31 దాఖలైనాయి. ఆర్వో కార్యాలయ పరిసరాలు భారీ జనసందోహంతో, ర్యాలీలతో, మైకుల మోతతో, కార్యకర్తల నినాదాలతో మార్మోగాయి. ఇప్పటివరకు మూడు సెగ్మెంట్స్ పరిధిలో 54 మంది అభ్యర్థులు 76 నామినేషన్ సెట్స్ దాఖలు చేశారు.

రామగుండం పరిధిలో..

రామగుండం నియోజకవర్గంలో 12 నామినేషన్లు దాఖలైనట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి జె.అరుణశ్రీ తెలిపారు. బీఆర్ఎస్ అభ్యర్థిగా కోరుకంటి చందర్‌పటేల్, కాంగ్రెస్ అభ్యర్థిగా మక్కాన్‌సింగ్ రాజ్ ఠాగూర్ నామినేషన్ దాఖలు చేశారు. బీజేపీ అభ్యర్థిగా కందుల సంధ్యారాణి, ఇండిపెండెంట్‌గా సోమారపు సత్యనారాయణ రెండోసారి నామినేషన్ అందజేశారు. తమ్మెర మన్మోహన్ విద్యార్థుల రాజకీయపార్టీ నుంచి రెండో నామినేషన్ వేశారు. తెలంగాణ లేబర్ పార్టీ అభ్యర్థిగా గొర్రె రమేశ్, బహుజన్ సమాజ్‌వాది పార్టీ అభ్యర్థి ఎరుకల రాజనర్సయ్య, ఇండిపెండెంట్లుగా పెద్దపల్లి సందీప్, కాంపెల్లి రఘుబాబు, నీరటి శంకర్, మహ్మద్‌షకీర్‌బాబా, శీలం శ్రీనివాస్ నామినేషన్లు దాఖలు చేశారు.

పెద్దపల్లిలో..

పెద్దపల్లిలో 10మంది అభ్యర్థులు 12 సెట్ల నామినేషన్లను రిటర్నింగ్ అధికారి మధుమోహన్‌కు అందజేశారు. బీఆర్ఎస్ అభ్యర్థిగా దాసరి మనోహర్‌రెడ్డి నామినేషన్‌ను శాసనమండలి విప్ భానుప్రసాదరావుతో కలసి దాఖలు చేశారు. కాంగ్రెస్ అభ్యర్థి విజయరమణారావు తరఫున అశోక్‌గౌడ్, సత్యనారాయణరెడ్డి, బహుజన సమాజ్ పార్టీ అభ్యర్థి దాసరి ఉష తరఫున ఆమె తల్లి పద్మ, పోతని పురుషోత్తం, రియాజ్, శారద, బీజేపీ అభ్యర్థిగా కొలిపాక శ్రీనివాస్ నామినేషన్ వేశారు. యుగతులసి పార్టీ నుంచి రెడ్డి వేణుగోపాల్, ఆకుల స్వామి నామినేషన్లు వేశారు. జై స్వరాజ్‌పార్టీ నుంచి బోడదాస్ రాజయ్య, ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ నుంచి నల్ల మనోహర్‌రెడ్డి, ధర్మసమాజ్ పార్టీ నుంచి ఆమని, స్వతంత్ర అభ్యర్థిగా కొక్కిస దేవేందర్‌గౌడ్ నామినేషన్ దాఖలు చేశారు.

మంథనిలో..

మంథని అసెంబ్లీ నియోజకవర్గంలో ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ నుంచి అజిత్‌కుమార్ సాగి, టీఆర్ఎస్ నుంచి పుట్ట శైలజ, స్వతంత్ర అభ్యర్థులుగా పోతుల అన్వేష్, చల్లా లక్ష్మణ్, నాగినేని జగదీశ్వర్‌రావు, అలయన్స్ ఆఫ్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ పార్టీ నుంచి ఆర్ల నాగరాజు నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారి హనుమనాయక్‌కు అందించారు. అలాగే బీఆర్ఎస్ అభ్యర్థి పుట్ట మధు, కాంగ్రెస్ అభ్యర్థి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, బహుజన్ సమాజ్ పార్టీ అభ్యర్థి చల్లా నారాయణరెడ్డి మూడో సెట్‌లు దాఖలు చేశారు.

నేడు భారీగా పడనున్న నామినేషన్లు

ఎన్నికల నామినేషన్లకు శుక్రవారం చివరిరోజు కావడంతో ప్రధాన పార్టీల అభ్యర్థులు మరో సెట్ నామినేషన్ వేయడంతో పాటు, స్వతంత్ర అభ్యర్థుల నామినేషన్ ప్రక్రియ మరింత జోరు అందుకోనుంది.

మీకు తెలుసా?



ఏ-ఫాం.. బీ- ఫాం అంటే?

కరీంనగర్ అర్బన్: ఎన్నికలొచ్చాయంటే ఏ-ఫాం, బీ-ఫాం పదాలు చర్చకొస్తుంటాయి. 25ఏళ్లు నిండినవారు ఎవరైనా ఎన్నికల్లో పోటీ చేసేందుకు అర్హులు కాగా.. పార్టీ గుర్తు రావాలంటే ఫాంలతోనే సంబంధం. పార్టీ తరఫున ఎన్నికల రిటర్నింగ్ అధికారికి అందజేసే పత్రమే బీ-ఫాం. తమ పార్టీ నుంచి ఫలానా వ్యక్తి పోటీపడుతున్నారని, పార్టీ గుర్తు కేటాయించాలని అభ్యర్థించడమే ఈ పత్రం ముఖ్య ఉద్దేశం. ఇక ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థిని ధ్రువీకరించేందుకు జాతీయ పార్టీ అధ్యక్షుడు, రాష్ట్రస్థాయిలో ఒకరికి అధికారం అప్పగిస్తారు. ఈ ప్రక్రియనే ఏ-ఫాం కాగా.. అధికారం పొందిన వ్యక్తి అభ్యర్థికి బీ-ఫాం జారీ చేస్తారు. రాష్ట్రస్థాయి గుర్తింపు పొందిన పార్టీ అధ్యక్షుడు తాను లేదా మరొకరికి లేదా జిల్లాస్థాయిలో ఒకరికి బీ-ఫాం జారీ చేసే అధికారాన్ని అప్పగిస్తుందని ఏ-ఫాం సూచిస్తుంది. ఏ-ఫాం ద్వారా అధికారం పొందిన వ్యక్తి పోటీచేసే అభ్యర్థికి బీ-ఫాం ఇస్తారు. ఏ-ఫాం, బీ-ఫాం పత్రాలు నామినేషన్ దాఖలు సమయంలో లేదా నామినేషన్ చివరి రోజు మధ్యాహ్నం 3గంటల్లోగా సంబంధిత రిటర్నింగ్ అధికారికి అందించాలి.

పోలింగ్ కేంద్రాలపై అభ్యంతరాలుంటే చెప్పండి

- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్



మాట్లాడుతున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

పెద్దపల్లిరూరల్: జిల్లాలోని పెద్దపల్లి, మంథని, రామగుండం నియోజకవర్గాల పరిధిలో అసెంబ్లీ ఎన్నికల కోసం ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్‌లపై ఏమైనా అభ్యంతరాలున్నాయా అని రాజకీయ పార్టీల ప్రతినిధులను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ అడిగారు. గురువారం కలెక్టరేట్‌లో సమావేశమై ఎన్నికల నిర్వహణకు సంబంధించి పలు అంశాలపై సూచనలు చేశారు. పోలింగ్ కేంద్రాల వివరాలను పరిశీలించి ఏమైనా అభ్యంతరాలుంటే చెప్పాలన్నారు. ఎన్నికల నిర్వహణలో జరిగే ఉల్లంఘనలపై సీ విజిల్‌యాప్‌లో ఫిర్యాదులు చేస్తే 100 నిమిషాల్లో పరిష్కరిస్తామన్నారు. 80 ఏళ్లు దాటిన వృద్ధులు, దివ్యాంగులకు ఇంటినుంచే ఓటే వేసే అవకాశాన్ని ఎలక్షన్ కమిషన్ కల్పించిందన్నారు. జిల్లానుంచి దాదాపు వెయ్యిమంది దరఖాస్తు చేసుకున్నారని పేర్కొన్నారు.

18న బ్యాలెట్ ముద్రణ

బ్యాలెట్ పేపర్ల ముద్రణ ఈనెల 18న జరుగుతుందని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ తెలిపారు. పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేయాలనుకునే వృద్ధులు, దివ్యాంగ ఓటర్ల ఇంటికి వీడియోగ్రఫీతో పంపుతారని, రాజకీయ పార్టీల ప్రతినిధులు కూడా వెళ్లొచ్చన్నారు. 13రకాల అత్యవసర సేవల్లో పనిచేసే వారికి పోస్టల్‌బ్యాలెట్ అవకాశం ఇచ్చారని తెలిపారు. వీరికి రిటర్నింగ్ అధికారి కార్యాలయం వద్ద తేదీలను నిర్ణయించి అదేరోజు పోస్టల్ ఓటింగ్ సెంటర్ ఏర్పాటు చేస్తారన్నారు. సమావేశంలో డీటీ ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల విధుల్లో అప్రమత్తంగా ఉండాలి

- ఎన్నికల సాధారణ పరిశీలకుడు శ్రీధర్



కేంద్రాన్ని పరిశీలిస్తున్న శ్రీధర్

పెద్దపల్లిరూరల్: ఎన్నికల విధులు నిర్వర్తించే అధికారులు అప్రమత్తంగా ఉండాలని సాధారణ పరిశీలకుడు శ్రీధర్ అన్నారు. కలెక్టరేట్‌లోని ఎన్నికల పర్యవేక్షణ కేంద్రాన్ని గురువారం పరిశీలించారు. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ కేంద్రం పనితీరును వివరించారు. సామాజిక మాధ్యమాల ద్వారా ఎన్నికల కోడ్ ఉల్లంఘనలపై ప్రత్యేక దృష్టిసారించాలని సూచించారు. లోకల్ చానల్ ద్వారా ప్రసారమయ్యే ప్రకటనలు, ప్రచారాలను రికార్డు చేయాలన్నారు. అధికారులు రవీందర్‌రెడ్డి, తిరుపతిరావు, ఏవో శ్రీనివాస్, ప్రవీణ్ తదితరులున్నారు.

ఆర్వో కార్యాలయం సందర్శన

మంథని: మంథని నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి కార్యాలయాన్ని గురువారం ఎన్నికల పరిశీలకుడు సీఎస్.శ్రీధర్ సందర్శించారు. నియోజకవర్గం వివరాలు, నామినేషన్లు, ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లపై చర్చించారు. రిటర్నింగ్ అధికారి హనుమ నాయక్, మంథని తహసీల్దార్ రాజయ్య, మీడియా సెల్ నోడల్ అధికారి తూము రవీందర్, ఎన్నికల డెప్యూటీ తహసీల్దార్ సంతోష్‌సింగ్ తదితరులు ఉన్నారు.

కోడ్ ఉల్లంఘనపై దృష్టిసారించాలి

- ఎన్నికల సాధారణ పరిశీలకుడు రాజేశ్‌సింగ్‌రాణా



మొక్క అందజేసి స్వాగతం పలుకుతున్న రిటర్నింగ్ అధికారి అరుణశ్రీ

గోదావరిఖని/జ్యోతినగర్: ఎన్నికల ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని రామగుండం అసెంబ్లీ నియోజకవర్గ ఎన్నికల సాధారణ పరిశీలకుడు రాజేశ్‌సింగ్‌రాణా అన్నారు. గురువారం రామగుండం రిటర్నింగ్ కార్యాలయానికి విచ్చేసిన ఆయన ఫిర్యాదుల పర్యవేక్షణ కేంద్రాన్ని పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. సామాజిక మాధ్యమాల్లో కోడ్ ఉల్లంఘనలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. పోలింగ్‌కు సంబంధించి ఈవీఎం పరికరాలు, పోస్టల్ బ్యాలెట్, 12 డీ, పోలింగ్ స్టేషన్లలో చేయాల్సిన ఏర్పాట్లు, వసతులు, సదుపాయాలు, జాగ్రత్తలు, నియమ నిబంధనల గురించి పలు సూచనలు చేశారు. పర్యవేక్షణ కేంద్రంలో సీ విజిల్, 1950 టోల్‌ఫ్రీ నంబర్ ద్వారా వచ్చే ఫిర్యాదులు రిజిస్టర్‌లో నమోదు చేస్తున్నామని, క్షేత్రస్థాయిలో ఫ్లయింగ్‌స్క్వాడ్, వీడియో సర్వేలెన్స్, స్టాటిక్స్ బృందాలకు సమాచారం అందించి వాటిని పరిష్కరిస్తున్నామని రిటర్నింగ్ అధికారి జె.అరుణశ్రీ వివరించారు. ఆయన వెంట రిటర్నింగ్ ఆఫీసర్, ఎన్నికల అధికారులు జ్యోతి, రామ్మోహన్ రావు, కుమారస్వామి, అశోక్‌కుమార్ ఉన్నారు.

మూడు రోజుల్లో రిపోర్టు ఎలా ఇస్తారు..?

- రాష్ట్ర ప్రభుత్వంపై కేంద్రం బురదజల్లే యత్నం
- ఐడీసీ మాజీ చైర్మన్ ఈద శంకర్‌రెడ్డి



మాట్లాడుతున్న శంకర్‌రెడ్డి

సాక్షి, పెద్దపల్లి: రాజకీయ లబ్ధికోసం, కేంద్ర పెద్దల కనుసన్నల్లో మూడు రోజుల్లో మేడిగడ్డ బ్యారేజీపై రిపోర్టు ఎలా ఇస్తారని ఐడీసీ మాజీ చైర్మన్ ఈద శంకర్‌రెడ్డి మండిపడ్డారు. గురువారం జిల్లాకేంద్రంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కేంద్ర బృందం పర్యటించిన మూడు రోజుల్లోనే రిపోర్టు ఇచ్చిందని, నేరుగా రాష్ట్ర ప్రభుత్వానికి ఇవ్వకుండా మీడియాకు రిపోర్టు విడుదల చేయడం వెనుక కేంద్రం కుట్ర దాగిఉన్న విషయం రాష్ట్ర ప్రజలు గమనించాలన్నారు. ఇప్పటివరకు కేంద్ర బృందం రాష్ట్ర ప్రభుత్వానికి అధికారికంగా రిపోర్టు ఇవ్వలేదని, ఇచ్చిన తర్వాత దానిపై సంబంధిత మంత్రులు స్పందిస్తారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వంపై బురద జల్లే ప్రయత్నమే తప్ప బ్యారేజీ పునరుద్ధరణకు నిర్మాణాత్మక సూచనలు చేయడంలో నివేదిక విఫలమైందన్నారు. కాంగ్రెస్, బీజేపీ నాయకులు కాళేశ్వరం ప్రాజెక్టుపై అవగాహన పెంచుకున్న తర్వాత మాట్లడితే బాగుంటుదని అన్నారు. రూ.80వేల కోట్లతో నిర్మించిన కాళేశ్వరంలో రూ.లక్ష కోట్ల అవినీతి ఎలా చోటుచేసుకుంటుందో ప్రతిపక్షాలకే తెలియాలన్నారు. రూ.లక్ష కోట్లు నీటిలో పోసినట్లేనని విపక్షాల ఆరోపణల్లో అర్థంలేదని, కాళేశ్వరం ప్రాజెక్టులో మేడిగడ్డతో కలిపి మూడు బ్యారేజీలు, 17 రిజర్వాయర్స్ ఉన్నాయన్నారు. మేడిగడ్డలో రెండు పిల్లర్స్ కుంగిపోతే మొత్తం ప్రాజెక్టు కొట్టుకపోయినట్లు కాంగ్రెస్ నాయకులు ప్రచారిస్తున్నారని విమర్శించారు. దేశంలో పేరున్న వ్యాకోస్ కంపెనీ ప్రాజెక్టు డిజైన్ చేసిందని, ఎల్అండ్‌టీ సంస్థ నిర్మించిందన్నారు. డ్యామేజీని సైతం సదరు సంస్థ నిర్మిస్తుందన్నారు. మూడేళ్లలో రికార్డు స్థాయిలో కురిసిన భారీ వర్షాలతో వచ్చిన వరదలను సైతం బ్యారేజీలు తట్టుకున్న విషయం విపక్షాలు గమనించాలని సూచించారు. జిల్లాకు చెందిన డీఎంఎఫ్‌టీ నిధులు పక్క జిల్లాలకు తరలిపోతుంటే శ్రీధర్‌బాబు ఇన్ని రోజులు ఎందుకు అడగలేదని, ఎన్నికలు వచ్చాకే ఆ విషయం గుర్తుకొచ్చిందా అని ప్రశ్నించారు. సమావేశంలో పెద్దపల్లి సివిల్ సప్లయ్ మెంబర్ పడాల సతీశ్‌గౌడ్, సర్పంచ్ బైరాం రమేశ్, కుమారస్వామి, రమేశ్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

జీవన నైపుణ్యాలు పెంపొందించుకోవాలి

• జిల్లా విద్యాధికారి డి.మాధవి


విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈవో

గోదావరిఖనిటౌన్‌: స్కౌట్స్‌ అండ్‌ గైడ్స్‌ విద్యార్థులు జీవన నైపుణ్యాలను పెంపొందించుకోవాలని జిల్లా విద్యాధికారి డి.మాధవి అన్నారు. స్థానిక శారదానగర్‌లోని శ్రీసరస్వతీ శిశుమందిర్‌ పాఠశాలలో ది భారత్‌ స్కౌట్స్‌ అండ్‌ గైడ్స్‌ జిల్లా అసోసియేషన్‌ ఆధ్వర్యంలో జరుగుతున్న తృతీయ సోపాన్‌ టెస్టింగ్‌ క్యాంపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రస్తుత సమాజంలో స్కౌట్స్‌ ప్రాముఖ్యం చాలా ఉందన్నారు. ఇది విద్యార్థులకు ఎంతగానో దోహదం చేస్తుందని తెలిపారు. అనంతరం టెంట్స్‌, కలర్‌ పార్టీ, ప్రథమ చికిత్స, వంట చేయడం వంటి పలు అంశాలను పరిశీలించారు. జిల్లా స్కౌట్స్‌ అండ్‌ గైడ్స్‌ సెక్రటరీ సూర్యదేవర జ్యోతి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో స్టేట్‌ ఆర్గనైజింగ్‌ కమిస్ట్‌ టి.ప్రమోదిని, ఎస్‌.భరతమాత, పి.సాయినిరంజన్‌, జె.రవీందర్‌, ఎ.సుందరి, పలు మండలాల పాఠశాల గైడ్స్‌, కెప్టెన్లు పాల్గొన్నారు.

నామినేషన్‌ ర్యాలీలో యువకుడి హంగామా

మంథని: మంథనిలో బహుజన సమాజ్‌ పార్టీ అభ్యర్థి చల్లా నారాయణరెడ్డి ఎన్నికల నామినేషన్‌ ర్యాలీలో గురువారం ఓ యువకుడు హంగామా చేశాడు. రెండు పదునైన కొడవళ్లను చేతపట్టుకొని చంపుతానంటూ మహిళలను బెదిరించాడు. దీంతో వారు భయంతో పరుగులు తీశారు. పోలీసులకు సమాచారమివ్వడంతో ఎస్సై కిరణ్‌ సదరు యువకున్ని అదుపులోకి తీసుకొని స్టేషన్‌కు తరలించారు. కాటారం మండలానికి చెందిన యువకుడని ఎస్సై తెలిపారు.

పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

సారంగాపూర్‌: అర్పపల్లి గ్రామంలో బుక్క రాజిరెడ్డి(53) అనే వ్యక్తి పురుగుల మందు తాగి చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. సారంగాపూర్‌ ఎస్సై తిరుపతి కథనం ప్రకారం.. రాజిరెడ్డి చాలాకాలంగా పక్షవాతంతో బాధపడుతున్నాడు. ఎన్ని మందులు వాడినా నయం కాకపోవడంతో జీవితంపై విరక్తి చెంది బుధవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు చికిత్స కోసం జగిత్యాలకు తరలించారు. పరిస్థితి విషమించడంతో కరీంనగర్‌కు తీసుకెళ్లారు. చికిత్స పొందుతూ మృతిచెందాడు. భార్య లక్ష్మీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోస్టుమార్టం తరలించారు. మృతుడికి కుమార్తె, కొడుకున్నారు.

భోజనాల వద్ద తన్నుకున్న బీఆర్‌ఎస్‌ నాయకులు

ధర్మపురి: మంత్రి కొప్పుల ఈశ్వర్‌ ధర్మపురిలో నామినేషన్‌ వేయగా.. కార్యకర్తలు భారీగా తరలివచ్చారు. వారికోసం ఓ ఫంక్షన్‌ హాల్‌లో భోజనాలు ఏర్పాటు చేశారు. వడ్డిస్తున్న సమయంలో కొందరు గొడవకు దిగారు. ఒకరిపై ఒకరు బెంచీలు, కుర్చీలు ఎత్తేసుకున్నారు. దీంతో ఫంక్షన్‌ హాల్‌ వద్ద ఉద్రిక్త వాతావరణం చోటు చేసుకుంది.

రైతు కోసం నిలబడేవారికే ఓటు

• అకాల నష్టం వస్తే సన్న, చిన్నకారు రైతులను ఆదుకోవాలి
• రైతుబంధుతో పాటు ఎరువులకు సబ్సిడీ ఇవ్వాలి
• సాక్షితో రైతుల మనోగతం

సాక్షి పీపుల్స్‌ ఎజెండా

సుల్తానాబాద్‌ రూరల్‌: రైతే రాజు అనేందుకు బాగానే ఉంది కాని.. రైతులకు నష్టం వచ్చినప్పుడు ఆదుకునే నాయకులే లేరని, ఇలాంటి సందర్భాల్లో రైతుల కోసం ముందుండి నిలబడే నాయకులకే మా ఓటేస్తామని రైతులు పేర్కొంటున్నారు. ‘సాక్షి’ రైతులను పలకరించగా.. వారి మనోగతం వెలిబుచ్చారు. అకాల వర్షాలు, ప్రకృతి వైపరీత్యాలతో పంటలు నష్టపోయిన చిన్న, సన్నకారు రైతులు అప్పులపాలవుతున్నారు. అధికారులు సర్వే చేసి నమోదు చేసుకుంటున్నారే తప్పా.. నష్ట పరిహారం అందడం లేదు. రైతులు ఆత్మహత్య చేసుకునే పరిస్థితులు ఎదురవుతున్నప్పుడు ప్రభుత్వంతో కొట్లాడి రైతులను ఆదుకునే వారికే పట్టం కడతాం. పెట్టుబడి సాయం కింద ఇచ్చే రైతుబంధు వందల ఎకరాల భూస్వాములకు ఇవ్వకుండా.. 80శాతం చిన్న, సన్నకారు రైతులకు రైతుబంధు ఇవ్వడంతో పాటు ఎరువులు, ఫర్టిలైజర్‌ మందులను సబ్సిడీపై అందించాలి. రైతు బీమాను రూ.5లక్షల నుంచి రూ.10లక్షలకు పెంచాలి. రైతుల కష్టాలు తెలిసిన నాయకులకే మద్దతు ఇస్తామని సుల్తానాబాద్‌, ఓదెల, కాల్వశ్రీరాంపూర్‌, ఎలిగేడు, జూలపల్లి మండలాల రైతులంటున్నారు.

సబ్సిడీపై ఎరువులందించాలి



పంట సాగు చేయాలంటే పెట్టుబడికే ఎక్కువవుతున్నాయి. ప్రభుత్వం రైతుబంధు ఇస్తున్నట్లే ఎరువులపై సబ్సిడీ ఇస్తే రైతుకు మేలు జరుగుతుంది.
– కాల్వ ఓదెలు, రైతు, సుల్తానాబాద్‌

కౌలు రైతుకు రైతుబంధు ఇవ్వాలి



కౌలు రైతులకు రైతుబంధు ఇవ్వాలి. వ్యవసాయాన్నే నమ్ముకొని కౌలు తీసుకొని వ్యవసాయం చేస్తే రెక్కల కష్టం తప్పా ఆదాయం లేదు. భూమినే నమ్ముకున్నాం.
– దూడం శ్రీనివాస్‌, కౌలు రైతు, సుల్తానాబాద్‌

రైతు పక్షం వహించే వారికే ఓటు




వ్యవసాయమే జీవనాధారంగా ఉన్న రైతుల పక్షం వహించే వారికే ఓటేస్తాం. రైతుల కష్టాలు తెలిసిన నాయకులయితేనే రైతులకు న్యాయం జరుగుతుంది.
– మంద లక్ష్మణ్‌, రైతు, తేలుకుంట, జూలపల్లి

ఓటే వజ్రాయుధం



వ్యవస్థనే మార్చే ఓటు వజ్రాయుధంగా పనిచేస్తుంది. రైతుల సమస్యలను పరిష్కరించే సత్తా ఉన్న నాయకులకే ఓటేస్తాం. రైతుల్లో చైతన్యం వస్తే సమర్థవంతమైన నాయకులు ఎన్నుకోబడతారు.
– రాగిడి మంగ, మహిళ రైతు, జీలకుంట, ఓదెల

మంచి చేసే వారికే ఓటు



మంచి పనులు చేసే నాయకులకే ఓటేస్తా. ఐదేళ్లకోసారి వచ్చే ఎన్నికల్లో అవినీతిపరులకు ఓటెయ్యను. అవినీతిరహిత సమాజం రావాలి.
– దొమ్మాటి రాజయ్య, రైతు, ఓదెల

మద్దతు ధర కల్పించాలి



పంటలకు మద్దతు ధర కల్పించిన వారికే ఓటేస్తా. రైతుల సంక్షేమం, అభ్యున్నతికి పాటుపడే పార్టీకే మద్దతిస్తాం. ఆరుగాలం శ్రమించి పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పిస్తామని చెప్పిన పార్టీకే నా ఓటు.
– భూసారపు పరశురాములు, రైతు, ధూళికట్ట, ఎలిగేడు

అవినీతి లేని ప్రభుత్వం కావాలి



అవినీతి లేని ప్రభుత్వం కావాలి. నాయకులు ప్రజలకు అందుబాటులో ఉండాలి. నకిలీ విత్తనాలు, ఎరువులు మార్కెట్లో లేకుండా చర్యలు తీసుకోవాలి. సకాలంలో రైతు రుణమాఫీ చేయాలి.
– గాజునలవేన అశోక్‌, రైతు, తారుపల్లి, కాల్వశ్రీరాంపూర్‌

పరిహారమందించాలి



పంట నష్టపోతే సకాలంలో పరిహారం,ఎరువులు, విత్తనాలు అందించాలి. 24గంటల కరెంట్‌, పెట్టుబడి సాయం కొనసాగించాలి. రైతు బీమా రూ.10లక్షలకు పెంచడం,50ఏళ్లు నిండిన రైతుకు పింఛనివ్వాలి. పక్షవాతానికి గురై మంచానికి పరిమితమైతే కుటుంబ పోషణకు నెలకు రూ.10వేలు చెల్లించాలి.
– గిరాం రవీందర్‌, రైతు, కాల్వశ్రీరాంపూర్‌

విద్యుదాఘాతంతో ఒకరు మృతి

మేడిపల్లి: భీమారం మండలం గోవిందారం గ్రామంలో గురువారం సాయంత్రం విద్యుదాఘాతంతో ఒకరు మృతిచెందారు. కోరుట్ల మండలం మోహన్‌రావుపేటకు చెందిన గుండవేని రాజేందర్‌ గోవిందారంలోని అక్క ఇంటికి దీపావళి నోముల సందర్భంగా రంగులు వేయడానికి వెళ్లాడు. రంగులు వేస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు విద్యుత్‌ తీగలు తగిలి పడిపోగా.. జగిత్యాలలోని ఏరియా ఆసుపత్రికి తరలించారు. అప్పటికే రాజేందర్‌ మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడికి భార్య రాజమణి, ఇంటర్‌ చదువుతున్న కూతురు న్నట్లు బంధువులు తెలిపారు.

స్వగ్రామానికి గల్ఫ్‌ కార్మికుడి మృతదేహం

కోరుట్లరూరల్‌: గుమ్లాపూర్‌ గ్రామానికి చెందిన గల్ఫ్‌ కార్మికుడు బోయిని వెంకటయ్య(53) వారం క్రితం ఖతార్‌లో గుండెపోటుతో మృతిచెందగా.. ఆయన మృతదేహం గురువారం స్వగ్రామం చేరింది. కుటుంబ సభ్యులు, బంధువుల రోదనలు మిన్నంటాయి. గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. వెంకటయ్య 30ఏళ్లుగా ఖతార్‌ వెళ్లి వస్తున్నాడు. ఏడాదిన్నర క్రితం సెలవుపై వచ్చి వెళ్లిన వెంకటయ్య వారం క్రితం పని చేస్తుండగా గుండెపోటు వచ్చింది. తోటి కార్మికులు వెంటనే ఖతార్‌లోని ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆసుపత్రిలోనే మృతిచెందాడు. ఈ విషయం వారి కుటుంబ సభ్యులు గల్ఫ్‌ సమితి వారికి చేరవేయగా.. వారు ఐసీబీఎఫ్‌ సహకారంతో మృతదేహాన్ని త్వరగా స్వదేశం తీసుకొచ్చేందుకు కృషి చేశారు. గురువారం వెంకటయ్య మృతదేహం శంషాబాద్‌ విమానాశ్రయానికి చేరుకోగా.. ప్రభుత్వం ఉచిత అంబులెన్స్‌ సౌకర్యం కల్పించింది. గల్ఫ్‌ సమితి సభ్యులు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. వెంకటయ్యకు భార్య లక్ష్మీ, ముగ్గురు కూతుళ్లు. అందరికీ వివాహమైంది. వెంకటయ్య కుటుంబానికి ప్రభుత్వం ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని గల్ఫ్‌ సమితి సభ్యులు డిమాండ్‌ చేశారు.

ఖమ్మంపల్లికి దొంగల భయం..!

• పంచాయతీ సామగ్రి ఎత్తుకెళ్తున్న వైనం
• అధికారులు పట్టించుకోవడం లేదని వాపోతున్న గ్రామస్తులు


చోరీకి గురైన విద్యుత్‌ మోటారు ఇదే..


ఖమ్మంపల్లి గ్రామ పంచాయతీ భవనం

ముత్తారం: ఆ గ్రామంపై దొంగల కన్ను పడింది. వరుస దొంగతనాలకు పాల్పడుతూ గ్రామస్తులను భయాందోళనకు గురి చేస్తున్నారు. అయినా అధికారులు పట్టనట్లు వ్యవహరిస్తున్నారని వారు వాపోతున్నారు. ముత్తారం మండలం ఖమ్మంపల్లి గ్రామ పంచాయతీ సామగ్రి ఎత్తుకెళ్తూ దొంగలు హల్‌చల్‌ చేస్తున్నారు. గతేడాది నుంచి పంచాయతీకి సంబంధించిన పలు అభివృద్ధి పనుల సామగ్రిని గుర్తుతెలియని వ్యక్తులు దొంగలించారు. గ్రామంలో పల్లెప్రకృతి వనం చుట్టు వేసే ఫెన్సింగ్‌ జాలీ రెండు క్వింటాలు, సేఫ్టీ గార్డులు, పంచాయతీ ట్రాక్టర్‌ సామగ్రి, పంచాయతీ నుంచి రైతు వేదిక వరకు నాలుగు బెండల విద్యుత్‌ తీగను ఎత్తుకెళ్లారు. శ్మశాన వాటికలోని విద్యుత్‌ దీపాలు, వాష్‌ బేషిన్లు సైతం దొంగలించారు. దసరా, సద్దుల బతుకమ్మ పండుగకు పెట్టిన 80 విద్యుత్‌ బల్బులను సైతం ఎత్తుకెళ్లారు. తాగునీరు సరఫరా చేసే విద్యుత్‌ మోటారు దొంగలించారు. వరుస దొంగతనాలపై స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు సర్పంచ్‌ సముద్రాల రమేశ్‌ తెలిపారు. పెద్దపల్లి డీసీపీకి ఫిర్యాదు చేయగా.. స్థానిక పోలీసులు విద్యుత్‌ మోటారును ఎట్టకేలకు రికవరీ చేసి పోలీస్‌ స్టేషన్‌లో ఉంచినట్లు సమాచారం. మిగతా సామగ్రిని ఇప్పించి నిందితులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సర్పంచ్‌, స్థానికులు కోరుతున్నారు. దొంగతనాలపై అధికారులు దృష్టి సారించకపోవడంతోనే పంచాయతీ సామాగ్రి, పలు అభివృద్ధి పనుల పరికరాలను ఎత్తుకెళ్తున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నాటుసారా, మద్యం స్వాధీనం


నాటుసారా స్వాధీనం చేసుకున్న ఎక్సైజ్‌ పోలీసులు

రామగుండం: అంతర్గాం మండల పరిధిలోని పలు గ్రామాల్లో గురువారం ఎక్సైజ్‌ పోలీసులు తనిఖీలు ముమ్మరం చేశారు. బ్రాహ్మణపల్లి తండా నుంచి రామగుండం ఎస్టీ కాలనీకి ద్విచక్ర వాహనంపై నాటుసారా తరలిస్తున్నట్లు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ద్విచక్ర వాహనంతో పాటు 12 లీటర్ల గుడుంబాను సీజ్‌ చేసి నిందితుడు సంపత్‌ను అరెస్ట్‌ చేసి కేసు నమోదు చేశారు. నిందితుడిచ్చిన సమాచారం మేరకు బ్రాహ్మణపల్లి తండాలోని అటవీ ప్రాంతంలో జరిపిన దాడుల్లో 30 లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకున్నారు. మరో 350 లీటర్ల బెల్లం పానకం నిల్వలను గుర్తించి ధ్వంసం చేశారు. అంతర్గాం మండల పరిధిలోని పలు బెల్ట్‌ షాపుల్లో సోదాలు నిర్వహించగా.. మద్యం కలిగి ఉన్న విక్రయదారులపై నాలుగు కేసులు నమోదు చేశారు. ఈ తనిఖీల్లో 3(1000ఎంఎల్‌), 78(180ఎంఎల్‌), 28(90ఎంఎల్‌), 4(కేఎఫ్‌ బీర్లు) మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఎక్సైజ్‌ సీఐ సుంకరి రమేశ్‌ మాట్లాడుతూ.. గుడుంబా, మద్యం తయారు చేసి నిల్వలు కలిగి ఉన్నా, అక్రమంగా రవాణా చేసినా చట్టప్రకారం కఠిన చర్యలు చేపడతామన్నారు. ఎస్సైలు శారద, విజయభాస్కర్‌, సిబ్బంది ఖదీర్‌, ప్రసాద్‌, తిరుపతి, రాజు పాల్గొన్నారు.

జనవిజ్ఞాన వేదిక పోస్టర్‌ ఆవిష్కరణ


పోస్టర్‌ ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయులు

జగిత్యాల: సీవీ రామన్‌ జయంతి పురస్కరించుకొని జన విజ్ఞాన వేదిక జిల్లా వేదిక ఆధ్వర్యంలో రూపొందించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ బృందం మాట్లాడుతూ.. జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ప్రగతికి తొలిమెట్టు ప్రశ్న అనే కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. నవంబర్‌ 7 నుంచి ఫిబ్రవరి 7 వరకు జరుగుతుందని, అందరూ పాల్గొనాలన్నారు. జిల్లా సైన్స్‌ అధికారి బాజోజి శ్రీనివాస్‌, కోరుట్ల మండల అధికారి నరేశ్‌, గౌరవ అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్‌, తులసి ఆగమయ్య, రాంప్రసాద్‌, రాములు, ధరణిదీప్‌ పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలి

• అదనపు కలెక్టర్‌ శ్యాంప్రసాద్‌లాల్‌


కేంద్రాన్ని ప్రారంభిస్తున్న శ్యాంప్రసాద్‌లాల్‌

జూలపల్లి(పెద్దపల్లి): రైతులు పండించిన వరి ధాన్యాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసి కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించి మద్దతు ధర పొందాలని అదనపు కలెక్టర్‌ శ్యాంప్రసాద్‌లాల్‌ సూచించారు. మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్‌ ఆవరణలో కరీంనగర్‌ జిల్లా మార్కెటింగ్‌ సొసైటీ ఆధ్వర్యంలో జిల్లా పౌరసరఫరాల శాఖ ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని గురువారం ప్రారంభించి మాట్లాడారు. రైతులు ధాన్యాన్ని ఆరబెట్టి, శుద్ధి చేసి కేంద్రానికి తీసుకురావాలని పేర్కొన్నారు. కేంద్రాల్లో రైతులకు సౌకర్యాలు కల్పించాలని, ఇబ్బందులు రాకుండా కొనుగోళ్లు చేపట్టాలని నిర్వాహకులకు సూచించారు. ఈ సందర్భంగా మండలంలో వరి సాగయ్యే విస్తీర్ణం, సాగునీటి సదుపాయాలు, దిగుబడి తదితర వివరాలను మండల వ్యవసాయాధికారి ప్రత్యూషను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో జిల్లా మార్కెటింగ్‌ అధికారి ప్రవీణ్‌రెడ్డి, పీఏసీఎస్‌ సీఈవో సురేశ్‌, ఏఈవో శ్రీవాణి, మార్కెటింగ్‌ అధికారులు పాల్గొన్నారు.

బొగ్గుబాయి

కాంట్రాక్ట్‌ కార్మికుల వేతనాలు పెంచాలి



మాట్లాడుతున్న అశోక్‌

యైటింక్లయిన్‌కాలనీ: సింగరేణిలో పని చేస్తున్న కాంట్రాక్ట్‌ కార్మికుల వేతనాలను పెంచడంతో పాటు వారి సమస్యలను పరిష్కరించాలని సింగరేణి కాలరీస్‌ కాంట్రాక్ట్‌ వర్కర్స్‌ యూనియన్‌ ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.అశోక్‌ డిమాండ్‌ చేశారు. గురువారం ఆర్జీ–2 ఏరియా యైటింక్లయిన్‌కాలనీ జోన్‌–2 ఏరియాలోని కాంట్రాక్ట్‌ కార్మికులతో నిర్వహించిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రం వచ్చిన 9ఏళ్ల నుంచి కాంట్రాక్ట్‌ కార్మికులకు ఒక రూపాయి కూడా రాష్ట్ర ప్రభుత్వం వేతనాలు పెంచలేదని ఆరోపించారు. తెలంగాణ ఉద్యమంలో కాంట్రాక్ట్‌ కార్మికులు సకల జనుల సమ్మెలో క్రియాశీలక పాత్ర పోషించారన్నారు. వేతనాలు పెరగకపోవడంతో కార్మికులు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. లింగయ్య, రాజేశ్వరి, రాయమల్లు, లింగయ్య, ప్రకాష్‌, నాగరాజు, నరేష్‌, రజిత, కొమురమ్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రచార వాహనాలకు అనుమతి తప్పనిసరి


భీమ్‌సింగ్‌

జ్యోతినగర్‌(రామగుండం): అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో పోటీ చేస్తున్న అభ్యర్థులు తమ ప్రచార వాహనాలకు అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని రామగుండం మోటార్‌ వెహికిల్‌ ఇన్‌స్పెక్టర్‌ డి.భీమ్‌సింగ్‌ అన్నారు. గురువారం ఎన్టీపీసీ టెంపరరీ టౌన్‌షిప్‌లోని కార్యాలయంలో మాట్లాడారు. అభ్యర్థులు సువిధ యాప్‌లో నమోదు చేసుకుని కార్యాలయానికి వస్తే సంబంధిత వాహనాల ధ్రువీకరణ పత్రాలు పరిశీలించి అనుమతి మంజూరు చేస్తామన్నారు. అనుమతులు పొందకుండా ప్రచారం నిర్వహిస్తే తనిఖీ సమయంలో వాహనాన్ని సీజ్‌ చేస్తామని పేర్కొన్నారు.

రామగుండం నియోజకవర్గంలో పార్టీలవారీగా ప్రచార వాహనాలు

పార్టీ	వాహనాల సంఖ్య
బీఆర్‌ఎస్‌	36
కాంగ్రెస్‌	27
బీజేపీ	08
బీఎస్పీ	05
వీఆర్‌పీ	06
ఎస్‌.సత్యనారాయణ, (స్వతంత్ర)	21
దయాకర్‌(స్వతంత్ర)	08
సందీప్‌(స్వతంత్ర)	01
మొత్తం	112



వెలవెలబోతున్న ‘పార్వతి’

మంథని: మంథని మండలం సిరిపురం సమీపంలోని పార్వతీ బ్యారేజీలో నీటి నిల్వలు తగ్గిపోయాయి. బ్యారేజీ 74 గేట్లలో నాల్గు గేట్లు ఎత్తి 2,300 క్యూసెక్కుల నీటిని దిగువకు వదిలారు. బ్యారేజీ సామర్థ్యం 8.83 కాగా ప్రస్తుతం1.980 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

సింగరేణిలో పెరిగిన మహిళా కార్మిక ఓటర్లు


మహిళా కార్మికులు

• 11 ఏరియాల్లో 1,500 మంది మహిళలు

గోదావరిఖని(రామగుండం): సింగరేణి సంస్థ విస్తరించి ఉన్న ఆరు జిల్లాల్లోని 11ఏరియాల్లో మహిళా ఉద్యోగుల సంఖ్య గణనీయంగా పెరిగింది. పెద్దపల్లి, ఖమ్మం, భద్రాద్రికొత్తగూడెం, భూపాల్‌పల్లి, మంచిర్యాల, కొమురంభీం ఆసిఫాబాద్‌ జిల్లాల్లో సింగరేణి విస్తరించి ఉంది. 2018కి ముందు సంస్థ మొత్తం మీద సుమారు రెండువందల మంది ఉద్యోగులు ఉండగా ప్రస్తుతం ఆసంఖ్య 1,500 మందికి చేరుకుంది. వీరిలో 650 మంది బదిలీ వర్కర్లు కాగా 850 మంది క్లరికల్‌, పలు విభాగాల్లో పనిచేస్తున్న మహిళా ఉద్యోగులు, అధికారులున్నారు. దీంతో ఈసారి సింగరేణిలో మహిళా ఓటర్లు పెరిగారు. కోర్టు ఆదేశాల మేరకు యాజమాన్యం మహిళా కార్మికులకు సైతం ఉద్యోగ అవకాశం కల్పించాలని నిర్ణయం తీసుకోవడంతో సంస్థలో కారుణ్య నియామకాల ద్వారా మహిళలు పెద్ద సంఖ్యలో చేరారు. ఉన్నత చదువులు చదివిన మహిళలు కూడా సింగరేణి ఉద్యోగాల్లో జాయిన్‌ అయ్యారు. గతంలో కారుణ్య నియామకాలు లేకపోవడంతో గనిప్రమాదంలో మరణించిన అధికారి, కార్మికుడి భార్య లేదా వారి కూతుళ్లకు మాత్రమే సంస్థలో ఉద్యోగావకాశాలు లభించేవి. ప్రభుత్వం కారుణ్య నియామకాల పేరుతో 2018లో మహిళా ఉద్యోగులకు అవకాశం కల్పిస్తూ నిర్ణయం తీసుకుంది. ఈసారి అసెంబ్లీ ఎన్నికల్లో సింగరేణి మహిళా ఉద్యోగులు, కార్మికుల ఓట్లు కీలకం కానున్నాయి.

మహిళ కార్మికుల సమస్యలపై దృష్టి

సింగరేణిలో పనిచేస్తున్న మహిళా కార్మికులపై ప్రధాన పార్టీలు దృష్టి పెట్టాయి. ఉన్నత చదువులు చదివిన మహిళా కార్మికులు సంస్థలో బదిలీవర్కర్లుగా ఉద్యోగాల్లో చేరారు. అయితే సంస్థలో మహిళా కార్మికులు పెరిగిపోవడంతో వారితో బెల్ట్‌క్లీనింగ్‌, గనులపై క్లీనింగ్‌ పనులతో పాటు కార్మికులతో సమానంగా మహిళా కార్మికులతో పనిచేయిస్తూ ఇబ్బంది పెడుతున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. చదుకు తగిన ఉద్యోగం కల్పించాలని కోరుతున్నారు. ఈక్రమంలో గనులపైకి వెళ్లిన అభ్యర్థులను సైతం ప్రశ్నిస్తున్న సందర్భాలు ఎదురవుతున్నాయి. గతంలో కన్నా సింగరేణిలో మహిళా కార్మికుల సంఖ్య పెరగడంతో అన్ని పార్టీలు వారి ఓట్లపై దృష్టిసారించాయి.